సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు

- అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

జఫర్‌గఢ్/స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను, 111 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పైసా లంచం లేకుండా, దళారీలు లేకుండా నేరుగా అందేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. లంచం రూపేణా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నష్కల్ రిజర్వాయర్ నుంచి పాలకుర్తి వరకు నిర్మించే కాల్వ పనులు జరగని విషయమై ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో నిర్వహించిన సమీక్షలో తెలిపానన్నారు. వెంకటాపూర్ నుంచి జఫర్‌గఢ్‌కు, గర్మిళ్లపల్లి నుంచి వయా సాగరం, జఫర్‌గఢ్‌కు రోడ్డు నిర్మాణానికి నెల రోజుల్లో మంజూరు ఇస్తామన్నారు. జఫర్‌గఢ్ లో ప్రధాన రోడ్డును నాలుగు రోడ్లుగా నిర్మించి, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. జఫర్‌గఢ్‌లో ఎంపీడీవో కార్యాలయ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయనున్నట్లు శ్రీహరి తెలిపారు. పీఏసీఎస్ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రోడ్డుపై బురద నీరు ఉండడంతో పరిశీలించిన అధికారులు, నాయకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డును మరమ్మతులు చేయించాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ శంకరయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీవో సుమన్, డీటీ హరిప్రసాద్, మాజీ ఎంపీపీలు కట్టా మనోజ్‌రెడ్డి, రడపాక సుదర్శన్, మాజీ జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో రూ.35.40 లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను, రూ. 40.50 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు. నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రికి గత ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. కానీ నిధులు మంజూరు కాలేదన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి వివరించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ నెలలోనే ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. రూ.24 కోట్లతో జీ ప్లస్ వన్ తరహాలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి ప్రతిప్రాదనలు పంపగా సీఎం అంగీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ రవీందర్, ఎంపీడీవో సదానందం, ఏసీపీ భీంశర్మ, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలకుర్తిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్ : ర్యాలీలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

- ఇంటింటా మొక్కలు నాటి సంరక్షించాలి
- అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్
- జిల్లా వ్యాప్తంగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

శామీర్‌పేటలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామలో మొక్కలు నాటుతున్న ఏసీపీ పార్థసారథి

రఘునాథపల్లి : మొక్కలు నాటుతున్న డీసీపీ

స్టేషన్ ఘన్‌పూర్/పాలకుర్తి రూరల్/నర్మెట/జనగామ రూరల్/లింగాల ఘనపురం/ తరిగొప్పుల/జఫర్‌గఢ్, ఆగస్టు 5 : ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్, చాగల్లులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలతోపాటు విద్యాసంస్థలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, గ్రామాల్లో డ్రైనేజీలను క్లీన్ చేయాలన్నారు. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని, కుక్కకాటుకు గురైతే చికిత్స తీసుకోవాలని సూచించారు. డీఎల్‌పీవో వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో మధుసూదన్, ఏపీవో ప్రేమయ్య, ఏపీఎం కుమారస్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, డాక్టర్లు జనార్దన్, మౌనిక, ఎంఎన్‌వో కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి సత్యం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్, మాజీ సర్పంచ్ పోగుల సారంగపాణి, వార్డెన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. పాలకుర్తిలో నిర్వహించిన ర్యాలీలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. ఊరూరా మొక్కలను నాటాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీటి నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి పాటుపడాలన్నారు. కేజీబీవీ, గురుకుల బాలికల పాఠశాలతోపాటు పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. డీఆర్‌డీవో మొగిలప్ప సీడీపీవో జయంతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో అవుల రాములు, ఏపీఎం పిట్టల నరేందర్, ఏపీవో అంబాల మంజుల, సీసీలు వెంకటేశ్వర్లు, వెంకటయ్య, అనురాధ, శోభరాణి, బైరపాక నవీన, అనుముల లక్ష్మి, డీటీ వేణుగోపాల్, ఆర్‌ఐ రాకేశ్, ఇంద్రాణి, లిల్లిదేబోరా పాల్గొన్నారు. నర్మెట మండలం వెల్దండ, కన్నెబోయినగూడెం, మచ్చుపహాడ్, హన్మంతాపూర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనంపై ర్యాలీలు నిర్వహించారు. డీఎల్‌పీవో పార్థసారథి మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం కోసం మొక్కలు నాటాలని ప్రజలను కోరారు. నర్మెటలో ప్రత్యేకాధికారి దామోదర్‌రావు డ్రైనేజీల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవో అరవింద్ పాల్గొన్నారు. వరంగల్ సీపీ ఆదేశాల మేరకు రఘునాథపల్లిలోని పోలీస్ స్టేషన్ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జనగామ డీసీపీ రాజా మహేంద్రనాయక్ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో వెయ్యి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఏసీపీ ఆర్‌బీ శర్మ, ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్, వీరన్న, మాధవి, సారంగం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ప్లాస్టిక్ రహితంగా జనగామ జిల్లాను మార్చాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం జనగామ మండలం యశ్వంతాపూర్, శామీర్‌పేటలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో విద్యార్థులు, ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రతను, పచ్చదనాన్ని పెంపొందించేలా సర్కారు చర్యలు చేపట్టిందన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. వీధి కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్ ఇస్తున్నట్లు తెలిపారు. 2300 జనాభా ఉన్న శామీర్‌పేటలో సుమారు 300 ఇళ్లలో విషజ్వరాలపై సర్వే చేపట్టినట్లు తెలిపారు. అనారోగ్యం బారిన పడితే ప్రభుత్వ దవాఖానకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి టెస్టులు చేయించుకోవాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని, కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి స్వరూపారాణి, జడ్పీ సీఈవో సరిత, మండల ప్రత్యేక అధికారి నరేంద్ర, ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్ కుమార్, ఏపీవో భిక్షపతి, ఈసీ మాధవరెడ్డి, ఈసీ అనిల్, పంచాయతీ కార్యదర్శి ఇఫ్తీకారుద్దీన్ పాల్గొన్నారు.

లింగాలఘనపురంలో మానవహారం

స్వచ్ఛదనం- పచ్చదనంపై లింగాలఘనపురం మండల కేంద్రంలో సోమవారం విద్యార్థులతో అధికారులు మానవహారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పర్చేందుకు పచ్చదనం, పరిశుభ్రత అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను సేకరించే విషయమై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కారోబార్ బోయిని సురేశ్‌కుమార్, హెచ్‌ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయుడు కొండబోయిన రాములు, అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, రాణి, ఇందిర, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తరిగొప్పులలోని ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి రాణాప్రతాప్ సింగ్ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు పింగిళి, ఉమరాణి, సంతోష, అంజమ్మ, శారద, గంగ పాల్గొన్నారు. జఫర్‌గఢ్ మండలం తిడుగు పాఠశాల, జీపీ ఆవరణలో ముళ్ల చెట్లను శుభ్రం చేయించారు. మండల స్పెషలాఫీసర్ మనోహర్, ఎంపీడీవో సుమన్ మాట్లాడుతూ పచ్చదనం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు రాజేశ్వర్, రాధిక పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఏసీపీ పార్థసారథి

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా సోమవారం జనగామలోని తన కార్యాలయ ఆవరణలో ఏసీపీ పార్థసారథి ఆధ్వర్యంలో కార్యాలయ, జనగామ పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి మొక్కలు నాటారు.

ఎస్సీ వర్గీకరణలో అభ్యంతరాలపై వినతి

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌కు మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి కుమార్ వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ అంశాలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుగంటి నరేశ్, గద్ద సాయి, గునుగంటి చంద్రశేఖర్, మద్దెల కార్తీక్, శెట్టి శ్రీనివాస్, గుణుగంటి నర్సింగ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో 10 దరఖాస్తులు

నర్మెట, ఆగస్టు 5 : ప్రజావాణి కార్యక్రమంలో 10 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ యాదయ్య ప్రజల నుంచి అందిన దరఖాస్తులను స్వీకరించారు. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

మల్లన్నగండికి చేరిన గోదావరి జలాలు

మల్లన్నగండికి చేరుతున్న గోదావరి జలాలు

నర్మెట, ఆగస్టు 5 : మండలంలోని మల్లన్నగండి రిజర్వాయర్‌కు సోమవారం ఇరిగేషన్ అధికారులు గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపిన అనంతరం మండలంలోని బొమ్మకూర్, వెల్దండ, కన్నెబోయినగూడెం రిజర్వాయర్లకు తరలించాలని కోరారు. వర్షాలు సరిగా లేక సాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నందున కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పట్టణంలో రెచ్చిపోయిన దొంగలు

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి రెండిళ్లలో దొంగతనం చేశారు. ప్రెస్టన్ కాలనీలో అశోక్‌నాయక్, పాలడి దేవా ఆదివారం ఇండ్లకు తాళం వేసి ఊరికి వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు రెండిళ్లలో తాళం పగులగొట్టి 12 తులాల వెండి, ఇతర ఆభరణాలు చోరీ చేసినట్లు తెలుస్తుంది. జనగామ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న కనకారెడ్డి

బచ్చన్నపేట, ఆగస్టు 5 : మండలంలోని గోపాల్‌నగర్ సర్వేనంబర్ 174లో గుడిసెవాసులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పట్టాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి ఆదేశాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. సోమవారం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని పదిహేడు గ్రామాల నుంచి వందలాది మంది పేదలు ఇక్కడ గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఈ భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ఆ భూమి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి చుంచు విజేందర్, ఇంజ ఎల్లయ్య, పర్వతం నర్సింహులు పాల్గొన్నారు.

తాళ్లపల్లి నాగరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : మృతుల బంధువులు, కుటుంబ సభ్యులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య సరయూ నది వదరలో ప్రమాదశాత్తు గల్లంతై వారంరోజులైనా యువతి ఆచూకీ లభించక దుఃఖంలో ఉన్న యువతి తండ్రి తాళ్లపల్లి నాగరాజు ఇంటికి వెళ్లి వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. మాతృవియోగంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, దిశ కమిటీ మాజీ సభ్యులు, పార్టీ ఎన్నికల అధికార ప్రతినిధి రావెల రవి ఇంటికి వెళ్లి పరామర్శించారు. రావెల పద్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనంలో జరిగిన పెనుగులాటలో గాయపడిన బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు గంగభవాని ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ఆమె ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎం.దయాకర్, బాల్దె కమలమ్మ, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజ్ కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొడకండ్ల, ఆగస్టు 5 : మండలంలోని కడగుట్ట తండాకు చెందిన మాజీ సర్పంచ్ ధరావత్ రమాదేవి మోహన్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శస్త్ర చికిత్స అనంతరం సోమవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాము పరామర్శించారు. వారి వెంట మండల ఉపాధ్యక్షుడు ఎండీ ఆసీఫ్, బాకీ ప్రేమ్‌కుమార్, మసురం వెంకటనారాయణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య మంగ్యా నాయక్, మంచా నాయక్, సూర్యనాయక్, దాజిలాల్ ఉన్నారు.

'స్వచ్ఛదనం - పచ్చదనం'పై ర్యాలీ

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం జనగామ మున్సిపల్ పరిధిలోని 30వ వార్డు ఎల్లమ్మగుడి చౌరస్తా వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని స్థానిక కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జీఎం సతీశ్, మున్సిపల్ ఆర్‌వో శ్రీనివాస్, వార్డు స్పెషల్ ఆఫీసర్ పులి విజయలక్ష్మి, వార్డు అధికారి శ్రీనివాస్, ఆర్‌పీలు శాంత, జెరిపోతుల స్వప్న, ఇందిర, అంగన్‌వాడీ టీచర్లు జోత్స్న, భారతి, ఆశావర్కర్ సునీత, ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు శాగ ప్రమీల, కోశాధికారి గూడెపు విజయ, కార్యదర్శి లక్ష్మి, ఓబీలు రమ, అన్నపూర్ణ, కాంగ్రెస్ వార్డు కార్యదర్శి నల్ల సుధాకర్, నాయకులు జెరిపోతుల శ్యామ్, యాదగిరి, బొట్ల మల్లయ్య పాల్గొన్నారు.

సిద్ధులగుట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు

బచ్చన్నపేట, ఆగస్టు 5 : మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సిద్ధేశ్వరుడిని దర్శించుకున్నారు. పెద్ది రాములు, శోభారాణి గుప్తా, ఆయన కుమారుడు సుఖేశ్ సహకారంతో ఆలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారి ఓంనమఃశివాయ, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, ఈవో వంశీ, ఆలయ సిబ్బంది చల్లా రాజేందర్‌రెడ్డి, భానుప్రకాశ్ రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, మధుమధు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ, సబ్ రిజిస్ట్రార్

ఏసీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ వేణు

స్టేషన్ ఘన్‌పూర్/రఘునాథపల్లి/ చిల్పూరు, ఆగస్టు 5 : స్టేషన్ ఘన్‌పూర్ సీఐగా జీ వేణు, సబ్ రిజిస్ట్రార్‌గా అమ్జద్ అలి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా బాధ్యతలు నిర్వహించిన ముస్కు రాజు హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ కాగా, ములుగులో సీఐగా బాధ్యతలు నిర్వర్తించిన జీ వేణు ఇక్కడికి వచ్చారు. నూతన సీఐ వేణు ఏసీపీ భీంశర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. స్టేషన్ ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన తాటికొండ నరేశ్ బీబీనగర్‌కు బదిలీ కాగా, వరంగల్ ఆర్‌వోగా పనిచేసిన అమ్జద్ అలి సబ్ రిజిస్ట్రార్‌గా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. వీరిని కార్యాలయ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

జనగామ రూరల్ సీఐగా శ్రీనివాస్ రెడ్డి

జనగామ రూరల్ సీఐగా ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన ఎలబోయిన శ్రీనివాస్ వరంగల్ కమిషరేట్‌లో పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూంకు బదిలీ అయ్యారు. కమిషనరేట్‌లో ఐటీ కోర్‌లో పనిచేసిన ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇక్కడ విధుల్లో చేరారు.

చిల్పూరు ఎస్సైగా నవీన్‌కుమార్

చిల్పూరు ఎస్సైగా సిరిపురం నవీన్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్సై ముత్యం రాజేందర్ హనుమకొండ కేయూ ఠాణాకు బదిలీ కాగా, వీఆర్ నుంచి సిరిపురం నవీన్‌కుమార్ ఇక్కడికి వచ్చారు. ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్

సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన అమ్జద్‌అలీ

విద్యార్థులు రూపొందించిన భారతదేశ భౌగోళిక స్వరూప చిత్రం

ఆశ్రమ పాఠశాలలో ప్రాక్టికల్‌గా విద్యాబోధన

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 5 : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రాక్టికల్‌గా విద్యాబోధన అందిస్తున్నారు. సోమవారం భారతదేశ భౌగోళిక స్వరూపంపై పర్వతాలు, కనుమలు, నదులు, గడ్డి మైదానాలు, సముద్రాలపపై భారతదేశ చిత్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల మనసులో గుర్తిండిపోయేలా బోధిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, సోషల్ టీచర్ జ్యోతి, పద్మ, రజిని, మాన్య పాల్గొన్నారు.

కోమల్ల పాఠశాల హెచ్‌ఎం పై విచారణ

రఘునాథపల్లి, ఆగస్టు 5: మండలంలోని కోమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కే నర్సింహులు మతిస్థిమితం కోల్పోయి విద్యార్థులు, ఉపాధ్యాయులపై అసభ్యకరంగా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ ఆఫీసర్ రఘుజీ, ప్రస్తుత ఆఫీసర్ రఘునందన్‌రెడ్డి పాఠశాలను సందర్శించి గ్రామస్తులను వివరాలు అడిగి సేకరించారు. వారు మాట్లాడి దీనిపై కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు.

వరుస చోరీలపై పోలీసుల దర్యాప్తు

పాలకుర్తి, ఆగస్టు 5: మండలంలో కొద్ది రోజులుగా జరుగుతున్న వరుస చోరీల పై సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రైమ్ బ్రాంచీ (సీసీఎస్) బృందం సభ్యులు సోమవారం విచారణ చేపట్టారు. పాలకుర్తిలో చిట్యాల లింగమ్మ ఇంటితో పాటు గూడూరు, బమ్మెర గ్రామాల్లో చోరీలు జరిగిన నివాసాలకు వెళ్లి పరిశీలించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజాపాలనకు విరుద్ధంగా పోలీసుల దాష్టీకం

మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి కుమార్

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ దళిత ఎస్సై ఉన్నతాధికారుల వేధింపులకు గురై సూసైడ్ నోటు రాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువక ముందే మరో దళిత మహిళపై కొందరు పోలీసులు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి తాటి కుమార్ మాల ఆందోళన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో దళిత మహిళపై పోలీసుల దాష్టీకంపై సోమవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరిగిన రెండు సంఘటనలు చూస్తే రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైందా..? అన్న అనుమానం కలుగుతుందన్నారు. తప్పు చేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటివి పునరావృతం కావన్నారు. దళిత మహిళ పట్ల పోలీసులు క్రూరంగా వ్యవహరించడాన్ని మాల మహాసభ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ప్రభుత్వం వెంటనే బాధిత మహిళకు అండగా ఉండి ఆమె చేసిన ఫిర్యాదు ఆధారంగా బాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి ఘటన జరిగితే కాంగ్రెస్ అధిష్ఠానం తోపాటు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. దీనిని సుమోటోగా స్వీకరించి జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్లు స్పందించి పోలీసులపై చర్యలు తీసుకోవాలి కోరారు.

భక్తులతో కిక్కిరిసిన క్షీరగిరి క్షేత్రం


పాలకుర్తి సోమేశ్వర పూజలు చేస్తున్న భక్తులు

పాలకుర్తి/రఘునాథపల్లి, ఆగస్టు 5: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం తొలిరోజు సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. పక్కనున్న లక్ష్మీనరసింహస్వామికి మొక్కులు చెల్లించారు. కొండ దిగువన ఉన్న చండికా అమ్మవారి ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు మత్తగజం నాగరాజు, దేవగిరి సునిల్ పాల్గొన్నారు. స్వామివారికి కిలో 97గ్రాముల మిశ్రమ వెండితో చేసిన చిన్న గంగాళం, వెండి చెంబును మహబూబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రాయపాటి వెంకట్‌రెడ్డి వనజ దంపతులు సమర్పించినట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. రఘునాథపల్లిలోని శివాలయం, శ్రీ మహాదేవస్వామి ఆలయంలో సోమవారం భక్తులు పూజలు చేశారు. పూజారి పిండిప్రోలు శ్రీనివాస్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ గుప్తా రేణుక దంపతులు, మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

పట్టణ ప్రగతి మాదిరిగా నిధులు ఇవ్వండి

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పట్టణ ప్రగతి మాదిరిగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి నిధులు కేటాయించాలని బీఆర్‌ఎస్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన జనగామ మున్సిపల్ అత్యవసర సమావేశం జరిగింది. తన వార్డులో డ్రైనేజీ నుంచి తీసిన చెత్త తరలించడం లేదని, ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ సభ్యురాలు పి.సుధ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో విజయవంతంగా అమలు చేసిన పట్టణ ప్రగతి ప్రణాళికలో నిధులు కేటాయించినట్లుగా అన్ని వార్డులకు పచ్చదనం-స్వచ్ఛదనంకు నిధులు ఇవ్వాలని పేర్ని స్వరూప కోరారు. బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనంపై ఏర్పాటు చేసిన సమావేశానికి సంబంధిత అధికారులు హాజరు కానప్పుడు ఎవరితో మాట్లాడాలన్నారు. పట్టణంలో కుక్కలు, కోతుల బెడద తీవ్రమైందని, సీసీరోడ్లు, మట్టి రోడ్లు సైతం గుంతలు పడ్డాయని, డ్రైనేజీలు లేక వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై మాట్లాడుతుండగా కాంగ్రెస్ సభ్యుడు బొట్ల శ్రీనివాస్ అడ్డుపడడంతో నా వార్డు సమస్యల నేను చెబుతుంటే మధ్యలో ఎందుకు జోక్యం అంటూ చైర్‌పర్సన్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. సుమలత, స్వరూప, ఉడుగుల శ్రీలత మాట్లాడుతూ సిబ్బంది లేకుంటే వార్డులో ఏం చేయలేమని వెంటనే కార్మికులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చైర్‌పర్సన్ అన్నారు.

160 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

చిల్పూరు, ఆగస్టు 5 : అక్రమంగా నిల్వచేసిన 160 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని రాజవరం శివారులో అక్రమంగా నిల్వచేసిన బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించేందుకు కొందరు యత్నిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం రాత్రి తనిఖీ చేసి పట్టుకుని ఎస్సై సిరుపురం నవీన్‌కుమార్‌కు అప్పగించారు. రాజవరానికి చెందిన మోటం దేవేందర్ గ్రామాల్లో కిలోకు రూ.9 చొప్పున కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలకు రూ.26 చొప్పున తరలిస్తున్నారని ఎస్సై తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ యాదగిరి, శ్రీనివాస్, కానిస్టేబుల్ వీరన్న,అనిల్, ఇంద్రాచారి పాల్గొన్నారు.

హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం : బీఆర్‌ఎస్

కొడకండ్ల, ఆగస్టు 6 : హామీల అమలులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి విఫలమయ్యారని మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాము తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చెన్నూరు రిజర్వాయర్ పనులను తన సొంత ఖర్చులతో చేశానని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పనులు ఎక్కడ జరిగాయో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. ఇతర పార్టీల నుంచి కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేకు లేదన్నారు.గతంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో చేసిన పనులను ఆమె ప్రారంభించారు తప్ప ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదని ఆయన విమర్శించారు.

యూత్ కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట, ఆగస్టు 5: స్థానిక ఆదర్శ రెడ్డి యూత్ సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. అధ్యక్షుడిగా పందిపెల్లి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వడ్డేపల్లి యాకంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పడిగెల కరుణాకర్‌రెడ్డి, కవ్వం రాజిరెడ్డి, కోశాధికారిగా అట్ల సందీప్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా లక్కిరెడ్డి చంద్రారెడ్డి ఎన్నికయ్యారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557